EVENING EDITION
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
09-12-2025
పేజీలు: 02





## టీమ్‌లోకి రావాలంటే రూ.1.2 లక్షల డీల్..

# బీసీసీఐ కళ్ల ముందే భారీ స్కామ్




ప్రపంచ క్రికెట్‌ను ఐసీసీ నడిపినట్టే, భారత క్రికెట్‌ను బీసీసీఐ నడుపుతుంది. కొత్త టాలెంటును వెలికితీయడంలో ఆటగాళ్లను అంతర్జాతీయ క్రికెట్‌కు సిద్ధం చేయడంలో బీసీసీఐ ఎంతో కృషి చేస్తోంది. అయితే పుదుచ్చేరిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ బీసీసీఐ కళ్ల ముందు జరుగుతున్న ఫేక్ అండ్ ఫ్రాడ్ వ్యవహారం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. పుదుచ్చేరిలో క్రికెట్ టీమ్‌లలోకి రావడానికి ఆటగాళ్లు షార్ట్‌కట్ ఎంచుకుంటున్నారు. కొంతమంది వ్యక్తులు బీసీసీఐ, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరికి పనిచేస్తూ, డబ్బు కోసం ఈ దందా నడుపుతున్నారు. డబ్బు తీసుకుని ఫేక్ అడ్రస్‌లు క్రియేట్ చేయడం, అర్హత ధృవీకరణ పత్రాలను అందిస్తున్నారు. బీసీసీఐ అండర్లోనే జరుగుతున్న ఈ అక్రమాన్ని ప్రముఖ మీడియా దర్యాప్తులో బయటపడింది.గత 3 నెలల్లో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 2,000కు పైగా ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ఫారాలను పరిశీలించింది. డజనుకు పైగా మాజీ, ప్రస్తుత ఆటగాళ్లు, అధికారులతో మాట్లాడింది. అంతేకాకుండా నివాస, విద్యా సంస్థలకు సంబంధించిన అనేక చిరునామాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత ఈ నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దర్యాప్తు ద్వారా ఒక వ్యవస్థీకృత చట్టవిరుద్ధ వ్యవస్థ నడుస్తున్నట్లు తేలింది. దీనిని అక్కడి ప్రైవేట్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు నిర్వహిస్తున్నారు. వీరు వేరే రాష్ట్రాలకు చెందిన క్రికెటర్ల కోసం నకిలీ డాక్యుమెంట్లు క్రియట్ చేస్తున్నారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం పుదుచ్చేరిలో ఉండాల్సిన ఒక సంవత్సరం నివాస అవసరాన్ని ఇలా నకిలీ పత్రాలతో పూర్తి చేయించి, ఆ ఆటగాళ్లను స్థానిక ఆటగాళ్లుగా మారుస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్యాకేజ్ రూపంలో రూ.1.2 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తానికి జరుగుతోంది. ఈ అక్రమ మార్గమే క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరి వివిధ వయో వర్గాల జట్లలో స్థానం సంపాదించడానికి దారి అవుతోంది.

ఈ అక్రమాలకు అతిపెద్ద సాక్ష్యం ఏమిటంటే.. వివిధ జట్లలో ఆడుతున్న 17 మంది స్థానిక క్రికెటర్లు మోతీనగర్‌లోని ఒకే ఆధార్ చిరునామాను ఉపయోగిస్తున్నారు. అయితే, ఆ ఇంటి యజమానిని సంప్రదించినప్పుడు, అద్దె చెల్లించనందున ఆ అద్దెదారులను నెలల క్రితమే ఖాళీ చేయించామని తెలిసింది. ఈ సిస్టమ్ వల్ల పుదుచ్చేరిలో పుట్టిన స్థానిక ఆటగాళ్లు అవకాశాలు కోల్పోయి, తీవ్రంగా నష్టపోతున్నారు. గత 4 సంవత్సరాలలో పుదుచ్చేరి 29 రంజీ మ్యాచ్‌లు ఆడింది, కానీ అందులో పుదుచ్చేరిలో పుట్టిన ఆటగాళ్లు కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఈ సీజన్‌లో జరిగిన వీనూ మన్కడ్ ట్రోఫీ ఓపెనింగ్ మ్యాచ్‌లో కూడా జట్టులోని 11 మందిలో 9 మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం.



### షారూక్‌ఖాన్ పేరిట 55 అంతస్తుల టవర్..

## దుబాయ్‌లో ఇవాళే ఓపెనింగ్

బాలీవుడ్ స్టార్ షారూక్ ఖాన్ పేరు మీద .. దుబాయ్‌లో షారూక్జ్ దనూబే టవర్‌ను నిర్మించారు. దనూబే ప్రాపర్టీస్ ఆ టవర్‌ను కట్టింది. 55 అంతస్తులు ఉన్న ఆ కమర్షియల్ టవర్‌ను ఇవాళ ఓపెన్ చేయనున్నారు. దుబాయ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో లాంచ్ ఈవెంట్ను నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో నటుడు షారూక్ ఖాన్‌తో పాటు దనూబే గ్రూపు చైర్మేన్ రిజ్వాన్ సాజన్ పాల్గొననున్నారు. షేక్ జైదా రోడ్డు మార్గంలో ఆ టవర్ ఉన్నది.



## అరుదైన రికార్డుకు అడుగు దూరంలో..

నేటి నుంచి సౌతాఫ్రికా-భారత్ మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. మంగళవారం కటక్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. అయితే టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఓ అరుదైన రికార్డుకు అత్యంత చేరువలో ఉన్నాడు. బుమ్రా టీ20 ఫార్మాట్ క్రికెట్‌లో ఇప్పటి వరకు 99 వికెట్లు తీశాడు. కటక్‌లో జరిగే మ్యాచ్‌లో మరో వికెట్ తీస్తే.. వికెట్ల సెంచరీ రికార్డు నెలకొల్పనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్ల(టెస్ట్, టీ20, వన్డే)లో వంద వికెట్లు తీసిన తొలి భారతీయ బౌలర్‌గా బుమ్రా చరిత్ర సృష్టించనున్నాడు. అయితే అర్ష్‌దీప్ సింగ్ టీ20లో ఇప్పటికే 100 వికెట్లు తీసినప్పటికీ.. మూడు ఫార్మాట్లలో ఈ రికార్డు అతడికి లేదు.

## సోనియా, మన్మోహన్‌ను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువబోరు: సీఎం రేవంత్ రెడ్డి



ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలోని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా.. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్ గా ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో రూ.5.8 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 18 అడుగుల ఎత్తుతో రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సోనియా గాంధీ పుట్టిన రోజున.. డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిన రోజని.. ఇది కలకాలం గుర్తుంటుందని పేర్కొన్నారు. 4 కోట్లమంది ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ నిర్ణయం తీసుకున్న రోజును.. తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా నిర్ణయించామని తెలిపారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే నెంబర్ వన్‌గా మార్చామన్నారు. సోనియా, మన్మోహన్‌ను ఎప్పటికీ తెలంగాణ ప్రజలు మరువబోరని.. సీఎం రేవంత్ తెలిపారు. 6 దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారని.. తెలంగాణ పథకాలు, కార్యక్రమాల్లో సోనియా గాంధీ, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోందని.. రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అస్థిత్వానికి ప్రతీకగా, పరిపాలనకు స్ఫూర్తిదాయకంగా నిలిచే తెలంగాణ తల్లి విగ్రహాలను అన్ని జిల్లాల పరిపాలన కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సందర్భమని సీఎం అన్నారు.

### జీఎంహెచ్‌ఎంసీ వార్డుల సంఖ్య పెంపు..

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం




తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీ వార్డులను 300కు పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో 150 వార్డులు ఉండగా.. 300కు పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇటీవలే నగర పరిధిలోని 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ వార్డు రీఆర్గనైజేషన్ స్టడీ రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం వార్డుల సంఖ్య పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 27 అర్బన్ లోకల్ బాడీల డేటాను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను కమిషనర్ సమర్పించారు. ఈ అధ్యయనం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో చేపట్టింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో పెరిగిన జనాభా, పట్టణ విస్తరణను పరిగణనలోకి తీసుకుని జీహెచ్‌ఎంసీ చట్టం 1955(సెక్షన్ 8, సెక్షన్ 5) నిబంధనల ప్రకారం కొత్త వార్డుల సంఖ్యను ఖరారు చేసింది. ముద్రణ శాఖకు 500 ప్రతులను అందించాలని కూడా సూచించారు. జీహెచ్‌ఎంసీలో వార్డుల పునర్విభజన, భవిష్యత్తులో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికలకు కీలకంగా మారనుంది. గెజిట్ విడుదల అయిన తర్వాత వారం పాటు అభ్యంతరాలకు అవకాశం ఇవ్వనుంది. ఆ తర్వాత మార్పులు, చేర్పులు చేసి నోటిఫికేషన్ ఫైనల్ చేయనుంది.




## ప్రభాస్ 'స్పిరిట్' కోసం స్పెషల్ సెట్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టార్ లైనప్ లో భారీ అంచనాలు ఉన్న సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ కోసం ఓ స్పెషల్ పోలీస్ స్టేషన్ సెట్ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సెట్ లో ప్రభాస్ పై ఎంట్రీ సాంగ్ ను షూట్ చేస్తారట. ఈ సాంగ్ లో ప్రభాస్ తో పాటు మరో హీరోయిన్ కూడా కనిపిస్తోందని తెలుస్తోంది. అన్నట్టు ఈ సాంగ్ షూట్ అనంతరం యాక్షన్ సీక్వెన్స్ ల షూట్ ను స్టార్ట్ చేస్తారట. కాగా ఈ యాక్షన్ ఎపిసోడ్స్ సినిమా మొత్తంలోనే హైలైట్ అవుతాయట. పైగా ఈ సీక్వెన్స్ ఈ సినిమా మొత్తానికే మెయిన్ హైలెట్ గా నిలిచిపోతుందట. కాగా మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ తో సందీప్ రెడ్డితో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశాడు. ఈ చిత్రాన్ని టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రాబోతుందని తెలుస్తోంది.

## సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు



కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే అంటే 1980లో సోనియా గాంధీ ఓటు హక్కు పొందారని.. మోసం, ఫోర్జరీ ద్వారా ఓటు హక్కు పొందిన ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు సమాధానం చెప్పాలని కోర్టు నోటీసుల్లో పేర్కొంది. సోనియా గాంధీతోపాటూ ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది. సోనియాగాంధీ 1983 ఏప్రిల్ 30న భారత పౌరసత్వం పొందిన విషయం తెలిసిందే. అయితే, అంతకు ముందే అంటే 1980లోనే ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేర్చారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీకి చెందిన న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ అవెన్యూ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ ఏడాది సెప్టెంబర్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు సరైన ఆధారాలు లేవని ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో కోర్టు తీర్పును సవాల్ చేస్తూ న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రౌస్ అవెన్యూ కోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ మేరకు పౌరసత్వం రాకముందే ఓటర్ల జాబితాలో పేరు ఉండటంపై వివరణ ఇవ్వాలని సోనియా గాంధీకి నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు పంపింది.



## సిద్ధుకి సినిమా అంటే పిచ్చి

సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న సినిమా తెలుసు కదా. నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది చాలా స్పెషల్ ఫిలిం. నాకు కథ చాలా నచ్చింది. ఇందులో రాగానే క్యారెక్టర్ లో కనిపిస్తాను. నీరజ అద్భుతంగా రాసింది. నీరజ గారి విజన్ మీ అందరికీ నచ్చుతుంది. తన నుంచి మరిన్ని మంచి సినిమాలు రావాలని కోరుకుంటున్నాను. జ్ఞాన శేఖర్ గారు సినిమాని అద్భుతంగా విజువలైజ్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. మా ప్రొడ్యూసర్స్ విశ్వ గారికి కృతి గారికి థాంక్యూ. ఈ సినిమాకి వాళ్ళు బ్యాక్ బోన్. తమన్ గారు అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చారు రాశిఖన్నాతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. అంజలి క్యారెక్టర్ ని అద్భుతంగా పెర్ఫాం చేసింది. సిద్ధు గారి జర్నీ ఇన్స్పిరేషన్. తను వండర్ఫుల్ కోస్టర్. తనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అక్టోబర్ 17న సినిమా థియేటర్స్ లో చూడండి తప్పకుండా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM


## కుర్రకారుకు చెమటపట్టిస్తోందిగా

ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి రోజు రోజుకు గ్లామర్ డోస్ పెంచుతూ అందరినీ ఆకట్టుకుంటుంది. కెరీర్ మొదట్లో చాలా పద్ధతిగా కనిపించిన ఈ మధ్య గ్లామర్ డోస్ పెంచి, హాట్ హాట్ లుక్స్‌తో కుర్రకారును మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ గ్రీన్ కలర్ ట్రెండీ డ్రెస్‌లో అదిరిపోయే లుక్‌లో ఫొటోలకు ఫోజులిచ్చింది. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి.అందాల చిన్నది కృతి శెట్టి గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ బ్యూటీ ఉప్పెన సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమై, మొదటి సినిమాతో అందరినీ మాయ చేసింది. ముఖ్యంగా తన గ్లామర్‌తో కట్టిపడేసి, యూత్ ఫేవరెట్ అయిపోయింది.ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తూనే బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకోవడంతో, స్టార్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో ఈ బ్యూటీ సత్తా చాటుతుంది అని అందరూ అనుకున్నారు. కానీ ఈ అమ్మడుకు మాత్రం మొదటి సినిమా తర్వాత లక్కు కలిసిరాలేదనే చెప్పాలి. ఎందుకంటే? ఉప్పెన తర్వాత ఈ అమ్మడుకు అనేక సినిమాల్లో ఛాన్స్‌లు వచ్చాయి. వరసగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ప్రతి సినిమా చేసింది.



## కొలెస్ట్రాల్ పెరిగినప్పుడు శరీరంలో కనిపించే సంకేతాలు ఇవే.!

అధిక కొలెస్ట్రాల్ అనేది చాలా సాధారణమైన ఆరోగ్య సమస్యలలో ఒకటి. ఈ సమస్య అనేక ఇతర తీవ్రమైన వ్యాధులకు దారితీస్తుందని నిపుణులు అంటున్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు, మనం వాటిని ముందుగానే గమనించలేము. దీనివల్ల గుండె సమస్యలు సహా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు అంటున్నారు. అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడానికి కారణాలు, లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. కొలెస్ట్రాల్ అనేది రక్తంలో ఉండే మైనపు లాంటి పదార్థం. మన శరీరాలకు కొలెస్ట్రాల్ అవసరం. కణాల నిర్మాణం, విటమిన్ డి, హార్మోన్ల ఉత్పత్తిలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని నిపుణులు అంటున్నారు. అయితే, కొలెస్ట్రాల్ స్థాయిలు చాలా




ఎక్కువగా ఉంటే, అది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సాధారణంగా, శరీరంలో రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్. అధిక స్థాయిలో చెడు కొలెస్ట్రాల్ ధమనులలో ఫలకాలు ఏర్పడటానికి కారణమవుతుందని, ఇది గుండె జబ్బులు, స్ట్రోక్‌కు దారితీస్తుందని నిపుణులు అంటున్నారు. అయితే.. మంచి కొలెస్ట్రాల్ గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

అధిక కొలెస్ట్రాల్ స్థాయిల లక్షణాలు

ఛాతీ నొప్పి
కాళ్ళలో నొప్పి లేదా తిమ్మిరి
చర్మ మార్పులు
తలతిరగడం
శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
అలసట
వాపు
హృదయ స్పందన రేటులో మార్పులు
దవడ నొప్పి

## హై అలర్ట్.. తెలంగాణ సీఎంవో, లోక్ భవన్‌కు బాంబు బెదిరింపు..



తెలంగాణ సీఎంవో, లోక్ భవన్‌కు బాంబు బెదిరింపు కలకలం రేపుతోంది. CMO, లోక్ భవన్‌ను పేల్చేందుకు కుట్ర చేస్తున్నారని గవర్నర్ కార్యాలయానికి ఖాన్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు తెలుస్తోంది. లోక్ భవన్, సీఎంవోను వెంటనే ఖాళీ చేయించాలని మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు రంగంలోకి దిగారు. హుటాహుటినా బాంబు స్క్వాడ్‌తో సీఎంవో, లోక్ భవన్ వద్ద తనిఖీలు చేపట్టారు. అలాగే, బెదిరింపు మెయిల్‌పై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉంటే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్ నుండి US వెళ్లే విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. బాంబు పేలకూడదంటే మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే అలర్ట్ అయిన అధికారులు ఐసోలేషన్ బే దగ్గర ఫ్లైట్‌ని ఉంచి పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు.





## తొమ్మిదో రోజుకు చేరిన ఇండిగో సంక్షోభం

ఇండిగో నిర్వహణ సంక్షోభం తొమ్మిదో రోజుకు చేరింది. మంగళవారం కూడా వందలాది విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల్లో దాదాపు 300 విమాన సర్వీసులు క్యాన్సెల్ అయ్యాయి. ఫలితంగా వేలాదిమంది ప్రయాణికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయి తీవ్ర అవస్థలు పడుతున్నారు. నేడు బెంగళూరు విమానాశ్రయంలో అత్యధికంగా 121 విమానాలు రద్దయ్యాయి. అందులో 58 అరైవల్స్ కాగా, 63 డిపార్చర్స్ ఉన్నాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో 58 (అరైవల్స్ 14, డిపార్చర్స్ 44), చెన్నైలో 41 (18 డిపార్చర్స్, 23 అరైవల్స్), ముంబైలో 31 విమానాలు (14 అరైవల్స్, 17 డిపార్చర్స్), అహ్మదాబాద్‌లో తొమ్మిది అరైవల్స్, ఏడు డిపార్చర్స్ మొత్తం 16 విమానాలు రద్దయ్యాయి. కేరళలో నాలుగు (అరైవల్ ఒకటి, డిపార్చర్స్ మూడు) రద్దయ్యాయి.

### రూ.827కోట్ల రిఫండ్ల చెల్లింపు

డిసెంబర్ 1 నుంచి 7 మధ్యకాలంలో జరిగిన 5.86 లక్షల పీఎన్ఆర్‌ల రద్దుకు సంబంధించి రూ.569.65 కోట్ల రిఫండ్లు చెల్లించినట్లు ప్రభుత్వం తెలిపింది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 7 వరకు 9.55 లక్షల పీఎన్ఆర్‌లు రద్దు కాగా వాటికి రూ.827 కోట్ల రిఫండ్లు చెల్లించినట్లు ప్రభుత్వం వివరించింది. ఇప్పటికే ప్రయాణికులకు చెందిన దాదాపు 4,500 బ్యాగులను ఇండిగో అంద చేయగా మిగిలిన 4,500 బ్యాగులను వచ్చే 36 గంటల్లో చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## రూ. 30 కోట్ల మోసం కేసు.. విక్రమ్ భట్ దంపతులు అరెస్ట్



ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు విక్రమ్ భట్, అతని భార్య శ్వేతాంబరి భట్‌ను రాజస్థాన్ పోలీసులు భారీ ఆర్థిక మోసం కేసులో అరెస్టు చేశారు. సుమారు రూ.30 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ దంపతులను ముంబైలో అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం ఉదయ్‌పూర్‌కు తరలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉదయ్‌పూర్‌లో పాపులర్ అయిన ఐవీఎఫ్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, డాక్టర్ అజయ్ ముర్డియా అతడి దివంగత భార్య జీవిత చరిత్ర ఆధారంగా ఒక బయోపిక్ తీస్తామని, ఆ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్మించి వారి వద్ద నుంచి రూ.30 కోట్లు తీసుకున్నట్లు అజయ్ తెలిపాడు. అయితే ఈ సినిమా నిర్మాణం అనుకున్న విధంగా సాగకపోవడం.. లాభాల విషయంలో క్లారిటీ లేకపోవడంతో మోసపోయానని భావించిన డాక్టర్ ముర్డియా ఉదయ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక ముర్డియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఉదయ్‌పూర్ పోలీసులు ప్రత్యేక బృందాలను ముంబైకి పంపించి విక్రమ్ భట్, శ్వేతాంబరి భట్‌లను అరెస్టు చేశారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరిచి విచారణ నిమిత్తం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఉదయ్‌పూర్‌కు తరలించే ప్రక్రియ జరుగుతున్నట్లు సమాచారం.


## భూవివాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి మరోసారి భూమి వివాదంలో చిక్కుకున్నారు. మేడ్చల్ జిల్లా సుచిత్ర సెంటర్‌లో కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తోంది. సర్వే నంబర్ 82, 83లో 1.29 ఎకరాల్లో 33 గుంటల స్థలాన్ని మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కబ్జా చేశారంటూ బాధితుడు శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో తమ భూములు కబ్జా చేశారంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక భూ వివాదం నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈరోజు (మంగళవారం) అధికారికంగా ల్యాండ్ సర్వే చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య సర్వే కొనసాగుతోంది. అయితే కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ తమ స్థలాన్ని కాజేసే కుట్ర చేస్తున్నారంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి ఆరోపిస్తున్నారు. రెండు వర్గాలు తమ తమ వాదనలు గట్టిగా వినిపిస్తున్న పరిస్థితి. దీంతో సర్వే జరుగుతున్న ప్రాంతంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

## టాక్సిక్‌తో రక్తపాతమే!

కన్నడ స్టార్ యశ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'టాక్సిక్' ఇప్పటికే ప్రేక్షకుల్లో ఎలాంటి బజ్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను గీతూ దాస్ డైరెక్ట్ చేస్తుండగా పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. కాగా, ఈ సినిమా నుండి తాజాగా ఓ ఇంటెన్స్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. గతకొద్ది రోజులుగా ఈ చిత్ర రిలీజ్ డేట్ వాయిదా అంటూ వచ్చిన వార్తలకు చెక్ పెడుతూ యశ్ ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 2026 మార్చి 19న 'టాక్సిక్' చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు మరోసారి ఈ పోస్టర్ ద్వారా కన్ఫర్మ్ చేశారు. ఇక టాక్సిస్ గ్యాంగ్‌స్టర్ రాకకు మరో 100 రోజులు మాత్రమే ఉందని ఆయన కౌంట్‌డౌన్ షురూ చేశారు. ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.






## మైనంపల్లి సంచలన కామెంట్స్

సోషల్‌మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికాకు వెళ్లడం ఖాయమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఆయన అన్నారు. కొంపల్లిలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతుందన్నారు. ప్రజలకిచ్చిన హామీలను చాలా వరకు అమలు చేశామని, ఐదేళ్ల లోపు మిగిలిన అన్ని హామీలను అమలు చేస్తామని అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో కోల్పోయిన ఇంకా అధికారంలోనే ఉన్నట్టు ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. పది సంవత్సరాల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.